# గృహాన్వేషణ

ప్రియమైన సుశీలకు: క్షేమంగానే వుద్యోగంలో జాయినయాను. నీతోటి ఆనందాన్ని అధికంగా అనుభవించ నీకుండా యీ రైల్వే వాళ్లు సెలవు తక్కువిచ్చి కట్టి తెచ్చారు మనిద్దరికీ విరహం తెస్తూ - అయితే వెనకటికి 'చలం' అన్నట్టు విరహం సంభవిస్తేకాని ప్రేమలేఖలు పుటవు, 'పెద్దలకు దండములు, పిన్నలకు దీవనలు' మాడల్ వుత్తరాలు కట్టిపెట్టి, కథల్లాగా వుత్తరాలు రాయడం నీకు నేర్పడానికే ఈ వుత్తరం వ్రాస్తున్నాను.

ఇక్కడి మూడుహోటళ్ళనూ, 'టర్న్' ప్రకారం మారుస్తు వచ్చాను. అయితే నాకు ముగ్గురూ గడ్డి పెడదామని కూడబలుక్కున్నట్లు తోచింది. అప్పుడప్పుడు పిడకలలు కూడా వొస్తున్నాయి. అందులో అడుగో ఆర్జీ అయ్యరంటున్నాడు—"మనం మంచి తిండి పెడితే బతకనిస్తారటండి యిక్కడి వాళ్లు? రెండుపూటలకి సరిపడగా ఒక్కసారే తినిపూడుస్తారు" అంటోంటే "నిజం, నిజం" అని తప్పట్లు వేస్తున్నాడు రామారావు. నిజమేగాబోలని కళ్ళద్దాల్లోంచి చూస్తే గుజరాతీ హోటల్ వాడు సానుభూతి ప్రకటిస్తోన్నట్టు నాకు తళుకలలొస్తున్నాయి. ఇవితప్ప యీ వూరివాళ్ళకి భోజన సౌకర్యం లేదు మరి.

భార్యల్ని పుట్టింటికి పంపినవాళ్ళకీ, పెళ్ళికాని బ్రహ్మచారులకీ, పెళ్లియిన్నీ యిల్లు దొరక్క బ్రహ్మచర్యం సాగిస్తోన్న 'నాతిగల బ్రహ్మచారులకీ, పోట్లాడుకుని భార్యా వియోగం అనుభవిస్తున్న వాళ్లకీ యీ వూళ్లో పీళ్లుతప్ప భోజనంపెట్టె దాతలేడు. 'నీవే తల్లివి తండ్రివి, నీవే నా తోడునీడ, నీవే సఖుడవు, గురుడవు, భార్గవు, భర్తవు' అని కృష్ణశతకం జ్ఞాపకం వొస్తోంది.

పై పిడకలల బాధ జాస్తీ అయి గృహాన్వేషణకు బయల్దేరాను. కష్టపడి మంత్రిపదవినైనా సంపాయించవచ్చును గాని, యీ వూళ్ళో అద్దెయిల్లు సంపాదించడం సాధ్యమయేపనికాదు. అథవా యెవడైనా సంపాయించ గలిగినా, వాడికి యే 'రావు బహదూరో' 'లాల్ బహదూరో' యిచ్చి సత్కరించ వలసిందే!

సాధ్యమైనంత త్వరగా యిల్లు సంపాయించడానికి ప్రయత్నిస్తున్నాను.

జవాబుమాత్రం రాయి. నీ—

భాను.

## 2

ప్రియ సుశీలకు—

నువ్వు చదివిన చదువే మరిచిపోయావో, లేక మీ వూరి పోస్టాఫీసు వాళ్ళకి 'నట్లు' వొదులయాయో తెలీదుగాని నీ దస్తూరి కనబడ్డం మానేసి చాలా రోజులయింది. ఒకవేళ నువ్వు చదువు మరిచిపోయిన పక్షంలో మీ తమ్ముడు బాబిగాడిచేత వ్రాయించవలసింది.

అక్కడ నేనున్నప్పుడు తరచు వస్తూండమని నువ్వు చెప్పినట్టు జ్ఞాపకం. ఇంకా రైల్వేవాళ్ళు నాలాంటి వాళ్లకోసం రైలు చార్జీలు 'మాఫీ' చెయ్యలేదు. రెండో పంచ

## జీవన్

వర్ష ప్రణాళికలో అన్నిరకాల వాళ్ళకీ సౌకర్యాలు కలగజేశారు గాని, నాలాంటి 'నాతిగల బ్రహ్మచారు'లకి యే విధమైన 'ఎలాట్ మెంటు' చెయ్యకపోవడం నిజంగా ఘోరమే!

ఈ బాడుగ యిళ్లకోసం తిరిగి తిరిగి నాకు నీరసం పటుకుంటోంది. కసితీరా యీ 'బాడుగ యిళ్ళ'ను 'బాడఖో' యిళ్ళ'ని తిట్టాలనిపిస్తుంది.

ఏమయినా నా ప్రయత్నాలు మాత్రం విడవలేదు. బాబిగాడికి నా ముద్దులు.

జవాబు రాయిస్తావుగా!

నీ

భాను.

## 3

డియర్ సుశీలాదేవి:

నీ కంత తొందరగా యిక్కడికి రావాలనుందో, అంత కంటె వేగంగా తీసుకురావాలని నాకూ వుంది. అయినా అది మనిద్దరి చేతుల్లో లేకపోవడం చేత ముందుకు సాగలేకపోతున్నాం.

నా 'బసాన్వేషణ'లో మరో మెట్టు ముందుకెళ్ళాను. అసలు ముందిక్కడి వాతావరణాన్ని పూర్తిగా వివరిస్తే తప్ప ఇక్కడి పరిస్థితులు నీ కర్థంకావు. అంతా రైల్వే కాలనీ తప్పించి, వున్న సివిల్ కాలనీ చాలా చిన్నది. అందులో శుభ్రత చాలా తక్కువ. కొన్ని ప్రాంతాలు చూస్తే అక్కడ మనుషులుంటారో, పందులుంటాయో పోల్చడం చాలా కష్టం. బహుశా రెండు జాతులూ కలిసి వుంటూంటాయి.

ఉన్న కొద్దిపాటి ఇళ్లూ చాలా పెద్ద అద్దెలకుగాని లభించవు. ఉన్నా, ఇళ్ళ యజమానులు తొంభై తొమ్మిది నిబంధనలు పెడతారు.

ఇటీవలి నా అనుభవాన్ని నీకు చెప్పకుండా వుండలేక పోతున్నాను.

పుల్లాభొట్ల శంకరంగారని మునశాబు వాళ్ళే...ఆయనయింట్లో ఒక భాగం ఖాళీగా వుందనివెళ్లి అద్దెకడిగితే, నా పుట్టు పూర్వోత్తరాలన్నీ కనుక్కుని 'పెళ్ళయిందా?' అన్నాడు. అయిందన్నాను. నమ్మకం కల్గలేదన్నాడు, పైగా కారణాలుకూడా వివరించాడు. కొంతమంది పెళ్ళయిందనీ, భార్య పుట్టింటిదగ్గర వుందనీ బొంకి ఇల్లు సంపాయించి చుట్టుప్రక్కల సంసారుల ఇళ్ళల్లో బూడిదపోస్తున్నారని సోదాహరణంగా వివరించిచెప్పాడు. అందుచేత మీనాన్న వేయించిన మన పెళ్ళిశుభలేఖ ఒకటి పంపించవలసింది. కనీసం దాని ఆధారంతోనయినా, ఆయన్ని ఒప్పించడానికి ప్రయత్నిస్తాను.

ఇంకా సౌశీల్యం గురించి Character యిద్దరు గెజెటెడ్ ఆఫీసర్లిచ్చినసర్టిఫికేట్లనూ, మా కాలేజీ ప్రిన్సిపాలిచ్చిన 'కాండక్టు సర్టిఫికేట్' నూ చూపించాను. పైగా 'సుశీలాపతి'నని మనవిచేసినా ఆయన నమ్మినట్టు కనబడదు.

సూటిగా నా మొహంమీదఅనకపోయినా పరోక్షంగా డొంక తిరుగుడు తోవలో చెప్పాడు - "నీవు చదువుకునేటప్పుడు అమ్మాయిల్ని మహాయేడిపించేవాడివటగదూ" అని. వాళ్ళింట్లో అమ్మాయి లున్నారని నాకు తరవాత తెలిసింది.

ఇంకో నయం. 'నువ్వు నాకు కలలో పోరంబోకుగా కనిపించావు. అందుచేత

## అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్ - 2.
(దక్కన్)



స్కినెడెక్స్
గజ్జి, దురదలు, పుండ్లు మొ॥
చర్మవ్యాధులకు దివ్యాంజనము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్ మద్రాసు-౩౦.








## తెల్ల వెంట్రుక లుండవు
(GOVT REGD).

రంగులనుచూచి మోసపోవద్దు, అది తాత్కాలికము. మా సువాసన "విశ్వకళ్యాన్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 50 సం॥ ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనమునిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధి చేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 5/- 3 సీసాలు రు. 12, సగము నెరసి వుంటే ఒకసీసా రు.6/- 3 సీసాలు రు.15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి ఫ్రీ.

MODERN DRUGS CORPN
(106) P. O. Pakribardwan (Gaya)


# ★ గృహోన్వేషణ ★

ఇల్లివ్వను' అనలేదు. పిడకలలబాధ నాకు తెలుసును గా మరి!

ముక్తికోసమైనా కాశానికోసారి మూడు కానులు పోస్టువాళ్ళకి ధర్మంచెయ్యి. రుక్మిణీదేవి చేతి తులసిదళంలో లాగా నీ ముక్కానీ అయినా వాళ్ళలోటు బడ్జెట్ పూడ్చగలదేమో!

నీ
కాను.

## 4

ప్రియ సుశీలారాణికి—

నువ్వు నాతో సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించినట్టుంది. ఎప్పుడూ ఈ వూరి పోస్టువాళ్ళే బ్రతుకుతున్నారు గాని మీ వూరి వాళ్ళు నీవల్ల ఒక్కకానీ అయినా తిన్న పాపానపోలేదు.

మా తమ్ముడు లక్ష్మణరావు కిక్కడెవరో పి. యస్. సోమయాజులుగారుట, వారి తమ్ముడిగారమ్మాయి వున్నది. వెళ్ళిచూసి రమ్మని మా నాన్నగారు రాశారు. ఆయన ఆఫీసు. అడ్రసుకూడా ఇచ్చారు.

ఒక శుభముహూర్తాన యాజులుగార్ని సంప్రదిస్తే, వాళ్ళ తమ్ముడింటికి తీసుకెళ్ళారు. ఒక్కక్షణం ఆ యాజులుగారి తమ్ముడూ, నేనూ పెళ్ళిరాటల్లాగా కొయ్యబారిపోయాం ఆయనింకెవరో గాదు. నా సౌశీల్యమ్మీద "రిమార్కు" పారేసిన శ్రీశ్రీశ్రీ శంకరం గారే!

పది నిముషాలవరకూ మేము ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటూ నిల్చుండిపోయాం. అయినా తప్పదు గనక ఆయనలోనికి వెళ్ళి టిఫిను తెచ్చి, కాఫీని అమ్మాయిచేత పంపించమని ఆర్డరిచ్చి వచ్చాడు.

మనిషంటే అక్కడున్నాడు కాని, మనసుమరోచోట పనిచేస్తోంది.

అమ్మాయి కాఫీతోసహా లోపలికి వొచ్చి వినయంగా మా ఇద్దరికీ ఇచ్చి ఎదురుగా కూచుంది.

కాఫీ కూడా చప్పరించడం పూర్తిచేసి—"అమ్మాయి పేరు లలితే నాండీ?"—అనడిగాను శంకరంగార్ని.

ఆవులిస్తే పేవులు లెఖ్ఖెట్టే రకమనుకున్నాడో యేమో, "అవును బాబూ!" అన్నాడు ప్లేటు తిరగేస్తూ.

"ఈ అమ్మాయి స్కూల్లో అన్నివిషయాల్లోనూ విచ్చలవిడిగా తిరిగేదని విన్నానండి" అన్నాను నూటిగా ఆయన వంక చూస్తూ.

అప్పటి ఆయన ముఖారవిందాన్ని వర్ణించడానికి మరో మహాకవి ఉద్భవించాల్సిందే గాని, నాచేతకాదు. సిగ్గు, రౌద్రం కలగాపులగంగా తాండవించాయి ఆయన ముఖంలో.

అంతటితో పూరుకోక—"ఇంతకు ముందెవర్నో ప్రేమించిందట గదండీ—" అన్నాను.

దాంతో ఆయన ముఖంలో రక్తమంతా ఎక్కడ దాక్కుందో తెలీదుగాని ముగ్గుపిండిలాగా తెల్లబారిపోయింది.

మారుతున్న ఆయన ముఖ కవళికల్ని చూస్తూంటే నాకు భయమేసి మరి అక్కడ నిలవకుండా గబగబా వొచ్చేశాను.

బాబిగాడికి ముద్దులు. జవాబులు రాయడం అలవాటుచేస్తూండు.

నీ
కాను.

## 5

సుశీలాకుమారీ!—

ఒక శుభవార్త. యింటికోసం నేను మొక్కిన మొక్కులూ, నా తరఫున నువ్వు నోచిన నోములూ ఈనాటికి ఫలించాయి.

అంతకుముందు రాశానే శంకరంగార్ని గురించీ, ఆయన పుత్రికారత్నం లలితాదేవి గురించీను. ఆయన యేమనుకున్నాడో నేను వూహించగలిగినంతవరకూ యిది—"సెకనుకి రేడియో తరంగాలు లక్షాయెనభై ఆరు వేల మైళ్ళ వేగంతో ప్రయాణంచేస్తాయని శాస్త్రజ్ఞులు చెబితే వినడమేగాని మనకి తెలీదు. కాని అమ్మాయిల ప్రేమకలాపాల వార్తలూ లోకం దృష్టిలో నీతిదూరమైన చర్యలుగా పరిగణింపబడే చేష్టల వివరాలూ—'పంపు' దగ్గర గుమిగూడే అమ్మలక్కల ద్వారానూ, కాలక్షేపానికి సాయంత్రంపూట వూరిమీద తిరిగే ఆంబోతులద్వారానూ సెకనుకి రెండు లక్షలమైళ్ళ దూరంతో పయనిస్తాయి" అని అనుకున్నాడో మరేమో!

నిన్నటే వొచ్చి వెంటనే ఇంట్లోంచి కదలవలసిందనీ, నిన్ను రమ్మని అర్జెంటుగా వైరిమ్మనీ బ్రతిమాలాడు. కొంచెం బెట్టుగానే మాట్లాడాను. అయినా ఈవాళే నాసామాన్లు ఆ యింటిలోకి మారుస్తున్నాను. లలితను మా తమ్ముడికి ఖాయం చేసినట్టే.

అందుచేత వెంటనే బయల్దేరి రావలసింది, ఒచ్చేముందర ఒక కార్డుముక్క రాస్తే స్టేషనుకు రాగలను.

నీ
కాను

## 6

డియర్ డార్లింగ్!

నువ్వురాసిన ఉత్తరం అందింది. మంచి ముహూర్తాలకోసం నువ్వు ఆలస్యం

చెయ్యడం నన్నింకా త్రిశంకుస్వర్గంలో వేలాడ దియ్యడంలాగే వుంది.

నీతో మీ 'బామ్మ' వొస్తుందన్న సంగతి ముందుగానే తెలుసుంటే ఇంతకంటె మంచి ఇల్లే—ఒకటి తీసుకుని వుందును. అనవసరంగా చెయ్యి జారిపోయింది. కాని ఆ ఇంటి చుట్టుపట్ల దెయ్యాలూ, భూతాలూ తిరుగుతుంటాయని చెబితే మానేశాను.

దెయ్యాలకైనా భయపడను గానీ మీ బామ్మకు దడుసుకుంటాగా. పెళ్ళిచూపులకొచ్చినప్పుడు, నన్ను చూసి అందంగా లేడని మీ బామ్మ అంటే భయంతో కుంచించుకుపోయిన నన్ను రక్షించడానికి స్వర్గంనించి మా తాతలు దిగిరావలసి వచ్చింది. 'సినీమా తారలకు సౌందర్యము నిచ్చు సబ్బు' రాసుకునే నన్నే అందంగా లేడన్న మీ బామ్మకి మూర్ఖు తలుచుకున్నప్పుడల్లా, నన్ను చేసుకోడానికి నువ్వెలా అంగీకరించావో తెలీక కొట్టుకుంటూంటాను. అందుచేత మీ బామ్మను చూస్తే దెయ్యాలూ, భూతాలు మరి రావని నా విశ్వాసం.

ఇంతకీ నీకు కాబోయే తోటికోడలిమీదనున్న అపవాదు నిజమో, కాదో తెలీడం లేదంటావా!

అదంతా నా గృహాన్వేషణలో పన్నిన పద్మవ్యూహం అని తెలిసి నువ్వు సంతోషించినా, సంతోషించకపోయినా—ఇల్లు సంపాయించడంలో నేను సాధించిన ఘన విజయానికి ప్రజలంతా సన్మానం చేసి యేదో పెద్ద బిరుదు పారేసి తీరతారు.

అందుకే నా విజయవివరాలన్నీ ఆంధ్ర పత్రికలో వేయించదలచుకున్నాను. ఏ మహాత్ముడయినా నా గొప్పతనాన్ని గుర్తించి మెచ్చుకుని ఘనమైన సన్మానంతో బిరుద ప్రదానం చేస్తాడనే ధైర్యంతో.

ఇక్కడ ఇల్లద్దెకు సంపాయించడం ఎంత కష్టమో తెలీనివాళ్ళకు నా గొప్పతనం తెలియదులే మరి!

వచ్చేప్పుడు కొత్త సంసారానికి కావలసిన సరంజామా అంతా తేవడం మరచిపోకు. ఎందుకంటే యిక్కడ అవన్నీ కొనాలంటే ధరలు ఎవరెస్టు శిఖరాన్ని మించి ఎత్తులో వుండడమే గాక మీ బామ్మ 'బ్యాంకు బాలెన్సు' తగ్గే సూచన ఉండదేమోనని భయపడుతున్నాను.

నీరాకకోసం యెదురు చూస్తోన్న—
నీ—
రాము.

★

